క్లుప్తంగా

చేతబడి నెపంతో వ్యక్తిపై దాడి

గండేపల్లి: చేతబడి చేస్తున్నాడనే నెపంతో వ్యక్తిపై మూకుమ్మడిగా దాడి చేసిన ఘటన ఈ నెల 2వ తేదీన మండలంలో చోటు చేసుకుంది. గండేపల్లి ఎస్సై వై.గణేష్‌కుమార్ వివరాల మేరకు మండలంలోని నీలాద్రిరావుపేట గ్రామ శివారు వైఎస్సార్ కాలనీలో నివాసం ఉంటున్న పసగోడుగుల చినబాబురావు చేతబడి చేస్తున్నాడనే నెపంతో అతని తమ్ముడు పసగోడుగుల శ్రీనివాస్, మరికొంతమంది అతని ఇంటికి వెళ్లి దౌర్జన్యానికి పాల్పడి అతనిపై దాడి జరిపి పై వరసలో రెండు పళ్లు, కింద వరుసలో రెండు పళ్ళు పీకి వేసి, గాయపరిచినట్లు తెలిపారు. బాధితుడు చినబాబు కాకినాడ ఆసుపత్రిలో వైద్యం చేయించుకున్నాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఘటన స్థలాన్ని జగ్గంపేట సీఐ బి.సూర్య అప్పారావు పరిశీలించి బాధితుడు ఇంటి పక్క, కాలనీలో నివసించే వారితో మాట్లాడారు. చేతబడి వంటి మూఢ నమ్మకాలు పెంచుకోకూడదని, వారికి అవగాహన కల్పించారు.

బాలుడి వైద్యానికి పేదల సంఘం చేయూత

గోకవరం: గోకవరంలో అరుదైన సీజీడీ వ్యాధితో బాధపడుతున్న రెండున్నరేళ్ల బాలుడు సత్యశ్రీఅక్షయ్‌రామ్ వైద్యానికి పేదల సంఘం ద్వారా ఆర్థిక సహాయం అందజేశారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వరసాల ప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక రమాసత్యన్నారాయణస్వామి ఆలయంలో బాలుడి కుటుంబ సభ్యులకు రూ. 35 వేలు అందజేశారు. అంతకు ముందు బాలుడి ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పాలూరి బోసుబాబు, సంఘం సభ్యులు కర్రి సూరారెడ్డి, కంచర్ల సూర్యప్రకాష్, కొలిపాకుల ప్రకాష్, బొర్రా రాజేష్, మేడిపూడి హరీష్, మండపాటి సతీష్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మహిళలకు పెద్ద పీట


గోకవరంలో మహిళా అధికారిని సన్మానిస్తున్న ఎంపీపీ శ్రీవల్లి

గోకవరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తుందని గోకవరం ఎంపీపీ సుంకర శ్రీవల్లి అన్నారు. గోకవరం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఎంపీపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు పలు పోటీలు నిర్వహించారు. వివిధ శాఖల్లో ఉత్తమ సేవలందిస్తున్న 40 మంది మహిళా ఉద్యోగులకు సన్మానాలు చేసి, జ్ఞాపికలు అందించి అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ శ్రీవల్లి, జెడ్పీటీసీ సభ్యుడు దాసరి శ్రీరంగ, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ వరసాల కుమారి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని మహిళా సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఎంపీపీ బుజ్జికి సత్కారం


ఎంపీపీ గొల్లపల్లి బుజ్జిని సత్కరిస్తున్న ఎంపీటీసీ సభ్యుడు బాబ్జీ

ఏలేశ్వరం: వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ జోనల్ వింగ్ ఇన్‌చార్జిగా నియమితులైన ఎంపీపీ గొల్లపల్లి బుజ్జిని పట్టణంలో బుధవారం సత్కరించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీటీసీ సభ్యుడు కొప్పుల బాబ్జీ ఆధ్వర్యంలో ఎంపీపీని పూలమాలతో సత్కరించారు. ఎంపీపీ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అప్పగించిన బాధ్యతను పూర్తిస్థాయిలో నిర్వర్తిస్తానన్నారు. శెట్టిబుల్లబ్బాయి, గొల్లపల్లి సూరిబాబు, శెట్టి చంద్రమౌళి పాల్గొన్నారు.

ఎయిడ్స్ రోగులు ఆరోగ్య సూత్రాలు పాటించాలి

శంఖవరం: ఎయిడ్స్ రోగులు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని రిఫరల్ ఆసుపత్రి చైర్మన్ స్లెషర్ బాబు, సంకల్పం లీడర్ శంకర్ అన్నారు. మండలంలోని సీతంపేట రిఫరల్ ఆసుపత్రిలో సంకల్పం సేవా సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్ రోగులకు పౌష్టికాహం కిట్‌లు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎయిడ్స్ రోగులు పౌష్టికాహారం తీసుకుని మందులు క్రమం తప్పకుండా వాడాలన్నారు. ఎయిడ్స్ రోగుల పట్ల ఎవరూ వివక్ష చూపరాదన్నారు. రోగులు ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకోవాలన్నారు.

అన్న సమారాధన

కిర్లంపూడి: స్థానిక శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వార్షిక మహోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఆలయం వద్ద అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఎంపీపీ తోట రవి, వైస్ ఎంపీపీ బొద్దేటి గణపతి, సొసైటీ చైర్మన్ చదలవాడ బాబి, పెంటకోట నాగబాబు పాల్గొన్నారు.

జీడి పప్పు సిరిశ్రమలు

- పలువురికి ఉపాధి
- శ్రామికులుగా వేలాదిమంది మహిళలు


జీడి పిక్కలను కటింగ్ చేస్తున్న మహిళలు


జీడి పప్పును గ్రేడింగ్ చేస్తున్న మహిళలు

తుని రూరల్: వేలాదిమంది మహిళలకు జీడి పప్పు పరిశ్రమలు (ఫ్యాక్టరీలు) ఉపాధి కల్పిస్తున్నాయి. నీడపట్టునే ఉంటూ రోజూ సంపాదించే అవకాశం లభించడంతో గ్రామీణ మహిళలు పెద్ద సంఖ్యలో ఫ్యాక్టరీలలో పనికి వెళుతున్నారు. జీడి గింజల కటింగ్, పొట్టు తీయడం, పప్పును పరిమాణాన్ని బట్టి గ్రేడింగ్ చేయడం తదితర పనులు చేస్తూ మహిళలు సంపాదిస్తూ తమ కుటుంబాలకు చేదోడుగా నిలుస్తున్నారు. మెట్ట ప్రాంతంలో జీడి పప్పు ఫ్యాక్టరీలు మహిళల ఉపాధిని చూపుతున్నాయి. ఇంటి పనులు చక్కబెట్టుకుని అందుబాటులో ఉండే ఫ్యాక్టరీకి వెళ్లే మహిళలు రోజుకి రూ.300 నుంచి రూ.450 వరకు సంపాదిస్తున్నారు. ఇలా నెలకు రూ.ఎనిమిది వేల నుంచి రూ.12 వేల వరకు సంపాదించి, ఆయా కుటుంబాలకు ఆర్థిక భరోసానివ్వడంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారు. తుని ప్రాంతంలో ఉన్న జీడి పప్పు ఫ్యాక్టరీల్లో ఆరువేల మందికి పైగా మహిళలు రోజూ ఉపాధి పొందుతున్నారు. పండగలు, పర్వదినాలు, వేసవిలో పనులు చేసేందుకు కూలీల కొరత ఎదురవుతోందని ఫ్యాక్టరీ యజమానులు చెబుతున్నారు.

20కి పైగా ఫ్యాక్టరీలు

ఉద్యానశాఖ తుని సబ్‌డివిజన్ పరిధిలో తొమ్మిది వేల హెక్టార్లలో జీడి తోటలు సాగవుతున్నాయి. దీంతో సబ్ డివిజన్ పరిధిలోగల తుని, కోటనందూరు, తొండంగి, శంఖవరం, రౌతులపూడి మండలాల్లో అధికారికంగా 20కి పైగా జీడిపప్పు పరిశ్రమలు ఉన్నాయి. వీటికి అనుబంధంగా ఇళ్ల వద్ద మరో 30 వరకు జీడిపప్పు శుద్ధి చేసే కార్యకలాపాలు జరుగుతున్నాయి. ఒక్కొక్క ఫ్యాక్టరీలో 100 నుంచి 200 మంది వరకు పనులు చేస్తుండగా అందులో 90శాతం మంది మహిళలే కావడం విశేషం. పరిశ్రమల్లో జీడి గింజలు నిల్వ చేయడం, కాల్చడం, కటింగ్, శుద్ధి చేయడం, ఎగుమతికి అనువుగా ప్యాకింగ్ వంటి పనులు చేయాల్సి ఉంది. ఇళ్లవద్ద మహిళలు పప్పు శుద్ధి చేయడం, గ్రేడింగ్ పనులు చేస్తున్నారు.

ఫ్యా 15 రోజులకోసారి వేతనం

ఈ పనులన్నింటికీ యాజమాన్యాలు వేర్వేరుగా కూలి డబ్బులను 15 రోజులకు ఒకసారి లెక్కకట్టి చెల్లిస్తున్నాయి. బాయిలర్, ప్యాకింగ్, రవాణా పనులు పురుషులు చేస్తుండగా కాల్చిన జీడి గింజలను కటింగ్, పప్పుపై పొట్టు తీయడం, గ్రేడింగ్ చేయడం పనులను మహిళలు చేస్తున్నారు.

వారంలో నాలుగైదు రోజుల పని



సొంత ఊర్లోనే ఉన్న ఫ్యాక్టరీలో కాల్చిన జీడి గింజలను కటింగ్ చేసే పనులు చేస్తున్నాను. రోజుకి 20 కిలోలకు పైగా జీడి గింజలను కట్ చేస్తాను. వారంలో నాలుగైదు రోజులు పని ఉంటుంది. రోజుకు రూ.నాలుగు వందల వరకు సంపాదిస్తాను.

– రమణమ్మ, కేఓ మల్లవరం

కుటుంబానికి చేదోడుగా..



నా భర్త వ్యవసాయ పనులు చేస్తున్నాడు. నేను ఫ్యాక్టరీలో జీడి పప్పు శుద్ధి చేసే పనులు చేస్తున్నాను. నెలకు రూ.ఎనిమిది వేల వరకు లభిస్తుంది. ఇద్దరూ సంపాదించిన మొత్తంతో ఇంటి ఖర్చులు, పిల్లలకు దుస్తులు, ఇతర ఖర్చులకు ఇబ్బంది పడకుండా సరిపోతున్నాయి.

– ఆర్.లక్ష్మి, తంగేడ

గ్రామాల్లో మౌలిక వసతులపై దృష్టి


సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేసిన ఎంపీపీ శ్రీవల్లి, జెడ్పీటీసీ సభ్యులు శ్రీరంగ తదితరులు

గోకవరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గ్రామాల్లో మౌలిక వసతులపై దృష్టి సారించిందని గోకవరం ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ సభ్యులు దాసరి శ్రీరంగ అన్నారు. గోకవరంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుటి వీధిలో సుమారు రూ.10 లక్షల మండల పరిషత్, పంచాయతీ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డుకు బుధవారం శంకుస్థాపన చేశారు. వారు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించామన్నారు. క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వరసాల కుమారి, గ్రామ సర్పంచ్ కొమరం శ్రావణి, వైస్ ఎంపీపీ మడికి మైనర్‌బాబు, ఎంపీటీసీ సభ్యులు తోలేటి రమ్యశ్రీ, నరాలశెట్టి గౌతమి, ఉనుకూరి అసిరమ్మ, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, సుంకర వీరబాబు, నరాలశెట్టి నర్శయ్య, తోలేటి రాంప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

ర్యాలీలు, సమావేశాలు


ఏలేశ్వరంలో ర్యాలీ చేస్తున్న మహిళలు


అన్నవరంలో సెంట్రల్ బ్యాంక్ బీఎం అపర్ణ, డెంటిస్ట్ తేజస్విని, ఎస్‌జీహెచ్ కో ఆర్డినేటర్ నాగలక్ష్మిని సన్మానించిన నిర్వాహకులు


తునిలో కేక్ కట్ చేస్తున్న నాసా వైద్యురాలు డాక్టర్ సౌమ్య

ఏలేశ్వరం: జాతీయ మహిళా దినోత్సవం నియోజకవర్గ వ్యాప్తంగా బుధవారం ఘనంగా నిర్వహించారు. పలుసంస్థలు, పలుపార్టీల ఆధ్వర్యంలో ర్యాలీలు, సమావేశాలు జరిగాయి. మహిళల్లో చైతన్యం కలిగించే విధంగా దినోత్సవం నిర్వహించారు. అఖిలభారత ప్రగతిశీల మహిళసంఘం(ఐప్వా) ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఐప్వా రాష్ట్ర కార్యదర్శి ఆర్ నాగమణి మాట్లాడుతూ దేశంలో మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అప్పలరాజు, వల్లూరి నాగమణి, రత్నకుమారి, లిబరేషన్ జిల్లాకార్యదర్శి ఏగుపాటి అర్జునరావు పాల్గొన్నారు.

అన్నవరంలో..

అన్నవరం: గతంలో వంటింటికే పరిమితమైన మహిళలు నేడు అన్ని రంగాలలో పురుషులతో దీటుగా రాణిస్తూ అగ్రస్థానంలో కొనసాగుతున్నారని స్థానిక ఇండియన్ బ్యాంక్ మేనేజర్ ఆనంద్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో గల ఇండియన్ బ్యాంక్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ అపర్ణ, డెంటిస్ట్ డాక్టర్ ఆకుల తేజస్విని, స్వయం సహాయక బృందాల కో-ఆర్డినేటర్ నాగలక్ష్మి, ఎస్‌జీహెచ్‌లో చురుకైన పాత్ర పోషిస్తున్న మహిళలను ఘనంగా సత్కరించారు. ఇండియన్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్లు ఆర్.రమేష్, ప్రియదర్శిని, స్థానిక వ్యాపారవేత్త దాసరి రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

తునిలో..

తుని: స్థానిక సిద్దార్థ కల్యాణ మంటపంలో అంబేడ్కర్ ఇండియా మిషన్ (ఎయిమ్) ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. నాసా సంస్థ వైద్యురాలు డాక్టర్ సౌమ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో ప్రగతి సాధించాలన్నారు. అనంతరం కేక్ కట్ చేసి మహిళలకు పంపిణీ చేశారు. కొల్లాబత్తుల చిన్నారి, పులగల సత్యవతి, పులి లక్ష్మి, కొల్లాబత్తుల అమ్మాజీ, వాణి, నిర్మల, బోడపాటి అరుణ పాల్గొన్నారు.

తుని రూరల్: జగన్నాథగిరిలోగల నాసా స్వచ్ఛంద సేవా సంస్థ ఆవరణలో కాకినాడ, తూర్పుగోదావరి, అనకాపల్లి జిల్లాలకు చెందిన మహిళలతో నాసా డైరెక్టర్ జ్యోతి ప్రేమదాస అధ్యక్షతన మహిళా దినోత్సవం జరిగింది. ప్రత్యేక ఆహ్వానితులుగా డాక్టర్ సౌమ్య పాల్గొన్నారు. వివిధ రంగాలలో రాణించిన మహిళలను సత్కరించారు. అనంతరం మహిళలు తుని వరకు ర్యాలీ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యుడు సోనీవుడ్, నాసా స్వచ్ఛంద సంస్థ డెవలప్‌మెంట్ డైరెక్టర్ సుజిత్ కాంత్, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. హంసవరంలో సర్పంచ్ రాయి మేరీఅవినాష్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు.

జగ్గంపేటలో..

జగ్గంపేట: వాకర్స్ క్లబ్ అధ్యక్షులు తోలేటి సూర్యనారాయణ ఆధ్వర్యంలో జగ్గంపేట జెడ్పీటీసీ సభ్యురాలు ఒమ్మి బింధుమాధవి, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ప్రసూతి డాక్టర్ శ్రావణ సంధ్య, జగ్గంపేట గ్రామ సర్పంచ్ బచ్చల నాగరత్నంను సత్కరించారు. రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, వాకర్స్ హెల్త్ క్లబ్ కార్యదర్శి ముమ్మిడివరపు సురేష్, ఉపాధ్యక్షుడు వెత్సా నాగసత్య పాల్గొన్నారు.

కాట్రావులపల్లిలోని ప్రజా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1988–89 లో విద్యను అభ్యసించిన ఆనాటి విద్యార్థినులను మహిళా దినోత్సవం సందర్భంగా కళాశాల ఆవరణలో పూర్వపు విద్యార్థుల నేత, వందనయూత్ వలంటరీ ఆర్గనైజషన్ అధ్యక్షుడు పులిప్రసాద్ ఆధ్వర్యంలో సత్కరించారు. పూర్వపు విద్యార్థుల సంఘం నేతలు సూరిమిల్లి వెంకటరమణ పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహిళాది నోత్సవాన్ని జగ్గంపేట రావులమ్మ నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతులనెహ్రూ, ఆయన సతీమణి మణి ఆధ్వర్యంలో నిర్వహించారు. జగ్గంపేట శివారులో వున్న విలేజ్ రీకనస్ట్రక్షన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం జరిపారు.

ప్రత్తిపాడులో..

ప్రత్తిపాడు: అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రత్తిపాడు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ప్రాంగణంలోని బార్ కార్యాలయంలో ఘనంగా జరిగింది. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బుగత శివ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో న్యాయమూర్తి కాటం భాను ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఆధునిక వ్యవస్థలో పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాలలో రాణించడం అభినందనీయమని ఆయన కొనియాడారు. లోక్ అధాలత్ బాధ్యురాలు శ్రీలక్ష్మి, మహిళా న్యాయవాదులు ఎస్.దేవీ, ఎ.సుగుణ, క్రాంతి కుమారి, అనూహ్య, బెహరా లక్ష్మీ ప్రసన్నలతో పాటు ప్లీడరు గుమస్తాలు, కోర్టు మహిళా సిబ్బందిని న్యాయమూర్తి కాటం భాను పూలమాలలతోనూ, దుశ్శాలువాలతో సత్కరించారు. బార్ ప్రతినిధులు రాజాల చిట్టిబాబు, ఆర్ శ్రీనివాస్, మల్లేశ్వరరావు, బి.మధుబాబు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులోని అఖిల్ విద్యాసంస్థలోజరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యాసంస్థ అధినేత ఇనకోటి గంగాధర్ ఆధ్వర్యంలో ఆమెను సత్కరించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బెహరా దొరబాబు, ప్రిన్సిపాల్ బుజ్జి, ఏఓ కొప్పుల సత్యనారాయణ పాల్గొన్నారు.

శంఖవరం: మండలంలోని కత్తిపూడి సీతారామ డిగ్రీ కళాశాల ఆవరణలో మహిళా దినోత్సవం జరుపుకున్నారు. ప్రిన్సిపాల్ వీరబాబు విద్యార్థినులు, మహిళా అధ్యాపకులను పండ్లు,శాలువాతో సత్కరించారు.



ప్రత్తిపాడు కోర్టు ప్రాంగణంలో మహిళా న్యాయవాదులను సత్కరిస్తున్న న్యాయమూర్తి కాటం భాను


ప్రత్తిపాడులో జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరిని సత్కరిస్తున్న అఖిల్ విద్యాసంస్థ సిబ్బంది


జగ్గంపేటలో జెడ్పీటీసీ సభ్యురాలు బిందుమాధవిని సత్కరించిన వాకర్స్ క్లబ్ సభ్యులు

సైన్స్‌పై విద్యార్థులు పట్టు సాధించాలి


సైన్సు ఫెయిర్‌ను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ సత్యవతి

ఏలేశ్వరం: సైన్స్‌పై విద్యార్థులు పట్టు సాధించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి అన్నారు. స్థానిక ఆగ్జీలియం స్కూల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్‌ను ఆమె ప్రారంభించారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్సు పరికరాలను పరిశీలించారు. అలమండ వీరరాఘవస్వామి, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

చురుగ్గా పోలీస్‌స్టేషన్ నిర్మాణ పనులు

- శ్లాబ్ పనులు ప్రారంభించిన ఎస్సై
- డిసెంబర్ నుంచి ఏకధాటిగా నిర్మాణం


కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభిస్తున్న ఎస్సై

కిర్లంపూడి: గ్రామంలో చేపట్టిన నూతన పోలీస్ స్టేషన్ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. బుధవారం శ్లాబ్ నిర్మాణ పనులను స్థానిక ఎస్సై టి.రఘునాథరావు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ పోలీస్ స్టేషన్ పనులకు 2022, డిసెంబర్‌లో ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, జిల్లా ఎస్పీ ఎం.రవీంద్రనాథ్‌బాబు భూమి పూజ చేసిన విషయం తెలిసిందే. పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఏఈ షేక్ వల్లీ మాట్లాడుతూ జగ్గంపేట సీఐ సూర్యఅప్పారావు, స్థానిక ఎస్సై టి.రఘునాథరావు చొరవతో సకాలంలో పోలీస్ స్టేషన్ నిర్మాణం పనులు పూర్తి చేస్తామన్నారు. వైస్ ఎంపీపీ బొద్దేటి గణపతి, కిర్లంపూడి సొసైటీ చైర్మన్ చదలవాడ బాబి, కాంట్రాక్టర్ నల్లా రాజశేఖర్, కన్వీనర్ యల్లపు శివ ఉన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం


బాధితులకు నిత్యావసర సరకులు అందజేస్తున్న కాకినాడ సెజ్ అధికారులు

తొండంగి: పెరుమాళ్ళపురం గ్రామ పంచాయతీ పరిధిలోని అవల్దారుపాడు గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఇళ్ళు దగ్ధమైన కుటుంబాల వారికి కాకినాడ సెజ్ అధికారులు సాయం అందజేశారు. ఒక్కో కుటుంబానికి సుమారు రూ.3 వేలు విలువ చేసే బియ్యం, వంట నూనెలు, పప్పులు, రవ్వలు, చోడి పిండి, చింతపండు నిత్యావసర సరకులు అందజేశారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా మరో రూ.5 వేలు విలువచేసే వంట సామగ్రి, దుస్తులు, దోమల బ్యాట్‌లను బాధితులకు సమకూర్చారు. గ్రామ ఉప సర్పంచ్ పెరుమాళ్ళ లోవరాజు, గ్రామ పెద్దలు గంగిరి అడవయ్య చేతుల మీదుగా బాధిత కుటుంబాలకు వస్తువుల్ని అందచేశారు. కాకినాడ సెజ్ యాజమాన్యం సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు నిర్వాహకులు తెలిపారు.

బస్టాండు సెంటర్లో ట్రాఫిక్ ట్రబుల్


కోటనందూరు బస్టాండ్ సెంటర్లో నిలిచిపోయిన ట్రాఫిక్ మురుగుమయంగా రోడ్డు

కోటనందూరు: స్థానిక బస్టాండు సెంటరు ట్రాఫిక్ దిగ్బంధంలో కొట్టుమిట్టాడుతోంది. ఈ సెంటరులో తరచూ ట్రాఫిక్ నిలిచిపోయి ప్రయాణికులతో పాటు స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. తుని, నర్సీపట్నం పట్టణాల మధ్య ప్రధానమైన సెంటర్ ఇది. అనకాపల్లి–కాకినాడ జిల్లాల్లోని సుమారు 50 గ్రామాల ప్రజలు ఈ బస్టాండు కేంద్రంగా ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. రోజంతా ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. ఇలాంటి బస్టాండు సెంటరులో ట్రాఫిక్ నియంత్రణను అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా రోడ్డును ఆక్రమించేసి ట్రాఫిక్ సమస్యను సృష్టిస్తున్నారు. దశాబ్దాలుగా తాత్కాలిక చర్యలతో ఇక్కడ తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభించడం లేదు. అధికారులు ట్రాఫిక్ సమస్య మూలాలపై దృష్టి సారించి శాశ్వత పరిష్కారం చూపించాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఈ సెంటర్‌లో వ్యాపారం చేసుకునే ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల నిర్వాహకులు రాత్రివేళ రోడ్డును అధ్వానంగా మారుస్తున్నారు. ప్లేట్లు శుభ్రం చేసిన నీళ్లను రోడ్డుపై పోస్తున్నారు. ఈ కారణంగా దుర్వాసన వెదజల్లడంతో పాటు ద్విచక్ర వాహనదారులు జారిపోయి ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ దుస్థితిపై అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.


ప్రత్తిపాడు తోటవీధిలో హోలీ వేడుక


ఏలేశ్వరం రంగులతో ఇలా..

ఉత్సాహంగా హోలీ

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులో బుధవారం పిల్లలు హోలీ వేడుకను ఉత్సాహంగా జరుపుకున్నారు. బుక్కాలు జల్లుకుంటూ సందడి చేశారు. రంగులు ముఖాలకు పూసుకుని, కేరింతలతో ఒకరిపైకి మరొకరు రంగునీళ్లు చిమ్ముకున్నారు.

ఏలేశ్వరంలో..

ఏలేశ్వరం: హోలీ వేడుకలను పట్టణంలో ఉల్లాసంగా ఉత్సాహంగా జరుపుకొన్నారు. యువతీయువకులు, పిల్లలు ఒకరిపై ఒకరు రంగులు జల్లుకుంటు సరదాగా గడిపారు. పల్లపువీధి, షిర్డీనగర్, దిబ్బలపాలెం, పెద్దవీధి తదితర ప్రాంతాల్లో యువకులు రంగులు జల్లుకున్నారు. సెలవురోజు కావడంతో మధ్యాహ్నం వరకు రంగులతో గడిపారు.